సాక్షి
మహబూబ్‌నగర్
శనివారం ၊ 7 ၊ డిసెంబర్ ၊ 2024



జడ్చర్లలో అమృత్ 2.0 సర్వే

అమృత్ 2. 0 ద్వారా చేపట్టిన డిజిటల్ సర్వే జడ్చర్లలో ప్రారంభమైంది.

వివరాలు 8లో ▸



మౌలిక వసతులు కల్పించాలి

పీయూ పరిధిలోని కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని వీసీ అన్నారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
33.5 /19.7

వాతావరణం

ఆకాశంలో కొంతమేర మేఘాలు ఉంటాయి. తెల్లవారుజామున, రాత్రి వేళ చల్లని గాలులు వీస్తాయి. తేమ ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పాలమూరుకు నవోదయ విద్యాలయం మంజూరు

పాలమూరు: తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం ఏడు జవహర్ నవోదయ విద్యాలయాలు మంజూరు చేయగా అందులో ఒకటి మహబూబ్ నగర్ జిల్లా కూడా ఉండటం విశేషం. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జిల్లాకు నవోదయ విద్యాలయం ప్రకటించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఎంపీ డీకే అరుణ కృతజ్ఞతలు తెలిపారు. నవదోయ విద్యాలయం జిల్లాకు రావడం వల్ల పాలమూరులోని పేద విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. వచ్చే విద్యా సంవత్సరంలో ప్రారంభం కానున్న ఈ పాఠశాలలో 560 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పించనున్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి: డీఈఓ



భూత్పూర్: పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని డీఈఓ ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని డీఈఓ పరిశీలించారు. ఉపాధ్యాయులు తరగతి గదిలో పాఠం బోధిస్తుండగా డీఈఓ పరిశీలించారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా బోధన ఉండాలని సూచించారు. ఉపాధ్యాయులు విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని, సమయ పాలన పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. డీఈఓ వెంటన ఏఎంఓ శ్రీనివాస్, తదితరులున్నారు.

డిమాండ్ల సాధనకు ఆటోల బంద్



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం శనివారం చేపడుతున్న ఆటో కార్మికుల సమ్మెను విజయవంతం చేద్దామని ఆటో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజు, సీఐటీయు జిల్లా కార్యదర్శి కురుమూర్తి కోరారు. ఈ మేరకు శుక్రవారం రైల్వేస్టేషన్ ఆటో స్టాండ్ వద్ద ప్రచారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటో, క్యాబ్ డ్రైవర్లకు సంవత్సరానికి రూ.15వేలు ఇవ్వాలని, ఆటో, రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఓలా, ఉబర్, రాపిడో కంపెనీలు నడిపిస్తున్న టూ వీలర్ల ట్యాక్సీలను నిషేధించాలని, ఆటోలకు థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలని కోరారు. యాక్సిడెంట్ ఎక్స్‌గ్రేషియా రూ.10 లక్షలకు పెంచి, సాధారణ మరణాలకూ వర్తింపచేయాలన్నారు. 50 ఏళ్లు నిండిన ఆటో డ్రైవర్లకు వృద్ధాప్య పింఛన్లు ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 2019 మోటారు వాహనాల చట్టాన్ని రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకుడు నగేష్, టీయుసీఐ జిల్లా నాయకులు వెంకటేశ్, శ్యాంసుందర్, వీరేష్, ఫాజిల్, నరేష్, యాదయ్య, మహబూబ్, మాసయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసులిచ్చిన 'సమగ్ర శిక్ష' కాంట్రాక్ట్ ఉద్యోగులు



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): సమగ్ర శిక్ష అభియాన్‌లో కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం డీఈఓ ప్రవీణ్‌కు సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10వ తేదీ నుంచి సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వందరోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ నేటికీ నెరవేరలేదని అన్నారు. 20 ఏళ్లుగా చాలీచాలని జీతాలతో వెట్టిచాకిరి చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. ఉద్యోగుల జేఏసీ పిలుపు మేరకు 10వ తేదీ నుంచి సమ్మెలోకి వెళుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, గీతారాణి, వరలక్ష్మి, మొగులయ్య, గంగమ్మ, కైసర్, సునిత, రేవతి, సబిత, ఎల్లప్ప, సవిత, హరిత, ఇందిర పాల్గొన్నారు.

భౌబోయ్.. కరుస్తున్నాయ్!



జిల్లాలో రోజురోజుకూ శునకాలు జనంపై దాడులు చేస్తూ బెంబేలెత్తిస్తున్నాయి. రోడ్లపై, ఇళ్ల వద్ద, దుకాణాల్లో కుక్కలు స్వైర విహారం చేస్తూ స్థానికులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. గ్రామం, పట్టణం అనే తేడా లేకుండా గుంపులు, గుంపులుగా రోడ్లపై తిరుగుతూ చిన్న పిల్లలు, మహిళలు, వృద్ధులు, వాహనదారులను వెంబడించి పరుగుపెట్టిస్తున్నాయి. ప్రతిరోజు జిల్లాలో ఎక్కడో ఒక చోట వీధి కుక్కల బారిన పడి గాయపడిన సంఘటన జరుగుతూనే ఉంది. ఏదైనా సంఘటన జరిగినప్పుడే స్పందించే అధికారులు తరువాత పట్టించుకోవడం లేదు. తాజాగా జిల్లాకేంద్రంలో ఓ వీధి కుక్క 18 గంటల వ్యవధిలో 31 మందిపై దాడి చేసింది. కుక్కల బెడదతో ఇంటి నుంచి బయట అడుగుపెట్టాలంటే భయంగా ఉందని జనం వాపోతున్నారు.

– పాలమూరు/మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ



వీరన్నపేటలో గుంపులుగా సంచరిస్తున్న వీధికుక్కలు

పాలమూరులో ఓ వీధి కుక్క స్వైరవిహారం

- 18 గంటల్లోనే 31 మందిపై దాడి
- ఏటా పెరుగుతున్న కుక్కకాటు బాధితులు
- చిన్నారులు, వాహనదారులను పరుగులు పెట్టిస్తున్న శునకాలు
- ఈ ఏడాది జిల్లాలో 6,125 కుక్క కాటు కేసులు నమోదు
- జనరల్ ఆస్పత్రిలో నిత్యం 30 నుంచి 40 మంది బాధితులకు టీకాలు

సాక్షి ఫోకస్

జిల్లావ్యాప్తంగా 16,446 వీధి కుక్కలు ఉన్నట్లు పశుసంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 49 వార్డులలో సుమారు 8 వేల వీధి కుక్కలు, జడ్చర్ల పట్టణంలోని 27 వార్డుల పరిధిలో మూడువేలు, భూత్పూర్‌లోని పది వార్డుల పరిధిలో సుమారు 600 వీధి కుక్కలు ఉన్నట్లు అధికారులు అంచనా వేశారు. జిల్లాకేంద్రంలోని మౌలాలిగుట్టలో మాత్రమే జంతు జనన నియంత్రణ కేంద్రం ఉంది. ఇక్కడ వంద కుక్కలను సంరక్షించేందుకు అవకాశం ఉంది. ప్రతిరోజూ పది నుంచి 12 వీధికుక్కల వరకు ప్రత్యేక బృందం పట్టుకుని ఈ కేంద్రానికి తరలించి వ్యాక్సిన్ వేసి వారం రోజుల తర్వాత ఎక్కడికక్కడ వదిలేస్తున్నారు. జడ్చర్లలో కొత్తగా జంతు జనన నియంత్రణ కేంద్రం పూర్తయినా ప్రారంభించలేదు. భూత్పూర్‌లో ఇంకా నిర్మాణ దశలోనే ఉంది. ఈ రెండు పట్టణాల నుంచి వీధికుక్కలను పట్టుకుని జిల్లాకేంద్రానికి తరలించి వ్యాక్సిన్ వేయిస్తున్నారు.



మహబూబ్‌నగర్ మౌలాలిగుట్టలోని జంతు సంరక్షణ కేంద్రంలో ఉంచిన వీధికుక్కలు



కుక్కకాటు గాయాలను చూపిస్తున్న గోల్‌మసీదు ప్రాంత వాసి



జిల్లా జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు

31కి చేరిన బాధితులు..

జిల్లాకేంద్రంలోని గోల్‌మసీదు ప్రాంతంలో ఓ కుక్క రెండు నెలల క్రితం ఆరు పిల్లలకు జన్మనిచ్చింది. అయితే గురువారం రాత్రి కొందరు చిన్నారులు వాటిని తరమడానికి యత్నించగా తల్లి కుక్క వెంటనే స్వైరవిహారం చేసింది. పాతపాలమూరు (వార్డు నం.11), హనుమాన్‌పురా (వార్డు నం.12), గోల్‌మజీద్, గౌడ్స్‌కాలనీ (వార్డు నం.25), హబీబ్‌నగర్ (వార్డు నం.26)లో విచ్చలవిడిగా సంచరించి రోడ్లు, వీధుల్లో కనిపించిన వారిపైకి ఎగబడి కరిచింది. గురువారం రాత్రి 24 మంది చిన్నారులపై, శుక్రవారం ఉదయం మరో ఏడుగురిపై దాడి చేసింది. దీంతో 18 గంటల్లోనే ఏకంగా 31 మందికి గాయాలయ్యాయి. రాత్రి గాయపడిన చిన్నారుల్లో ఐదుగురు ప్రస్తుతం జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సంఘటనతో అప్రమత్తమైన మున్సిపల్ అధికారులు శుక్రవారం రాత్రి ఆయా ప్రాంతాల్లో స్వచ్ఛ ఆటోల ద్వారా వీధికుక్కలతో అప్రమత్తంగా ఉండాలని టాంటాం చేయించారు. ఎక్కడైనా గుంపులుగా కుక్కలు సంచరిస్తే వెంటనే సెల్ నం. 70939 11352కు ఫోన్ చేయాలని సూచించారు.

బాబుకు తీవ్ర గాయాలయ్యాయి



మాకు ఇద్దరు సంతానం. రెండో కొడుకు ఆరేళ్ల మహ్మద్ ఫైజాన్ గురువారం రాత్రి 7.30 గంటలకు ఇంటి గేటు వద్దకు వెళ్లగానే ఓ వీధి కుక్క వేగంగా వచ్చి కరిచింది. దీంతో తల, వీపు భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే పెద్ద కూతురు కేకలు వేయడంతో నేను బయటకు వచ్చి రక్షించాను. అంతలోనే బాబుకు రక్తం ఎక్కువగా పోయి షర్ట్ మొత్తం ఎర్రగైంది. హుటాహుటిన జిల్లా ఆస్పత్రికి తీసుకొచ్చాం. – షిరిన్‌బేగం, గౌడ్స్‌కాలనీ

పది ఇంజక్షన్లు ఇచ్చారు..



మా అమ్మాయి అయిషా సిద్ధిఖా రాత్రి 7.30 గంటలకు సమీపంలోని ఓ షాపు వద్దకు వెళ్లి పెన్సిల్, రబ్బర్ తెచ్చుకొని వస్తుండగా.. ఓ వీధికుక్క వచ్చి కరిచింది. కుడిభుజాన్ని పట్టి పీకడంతో రక్తం కారి కండ బయటకు వచ్చింది. వెంటనే గమనించి పెద్దాస్పత్రికి తీసుకొచ్చాం. చిన్నారికి వైద్యసిబ్బంది పది ఇంజక్షన్లు ఇచ్చారు.రక్తపరీక్షలు చేసినా ఇంకా రిపోర్టు రాలేదు. మరికొన్ని రోజులు ఇక్కడే ఉండాలన్నారు.

– నర్సిన్ (అయిషా సిద్ధిఖా తల్లి), గోల్ మసీదు ప్రాంతం

అన్ని జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నాం

వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉన్న ఆయా వార్డుల్లో అన్ని జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నాం. ఎప్పటికప్పుడు వాటిని పట్టుకుని సంరక్షణ కేంద్రానికి తరలించి వ్యాక్సిన్ వేయిస్తున్నాం. ఎక్కడైనా గుంపులు గుంపులు సంచరిస్తుంటే వెంటనే మాకు సమాచారం ఇవ్వాలి. ప్రత్యేక బృందం పంపిస్తాం. తాజాగా జరిగిన సంఘటనతో జీహెచ్‌ఎంసీ నుంచి మరో బృందాన్ని రప్పిస్తున్నాం. ఆ వీధికుక్కను ఈపాటికే పట్టుకుని సంరక్షణ కేంద్రానికి తరలించాం. అది తిరిగిన ప్రాంతాల్లో మిగతా వాటినీ పట్టుకుంటాం. – డి.మహేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, మహబూబ్‌నగర్

మూడేళ్లలో 28,261 మందికి ఏఆర్‌వీ టీకాలు

జిల్లా ఆరోగ్య శాఖ పరిధిలో ఉన్న పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లు, ఇతర ఆస్పత్రుల్లో ఈ ఏడాది జనవరి నుంచి నవంబర్ వరకు జిల్లాలో 6,125 కుక్క కాటు కేసులు నమోదయ్యాయి. వారందరికి పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్‌లలో ఏఆర్‌వీ టీకాలు అందించారు. జనరల్ ఆస్పత్రిలో ఇతర జిల్లాకు చెందిన కుక్కకాటు బాధితులు కూడా టీకాలు భారీ స్థాయిలో తీసుకున్నారు.

■ జిల్లా జనరల్ ఆస్పత్రిలో శుక్రవారం ఒక్క రోజు కొత్తగా 20మందికి కుక్క కాటుకు సంబంధించిన ఏఆర్‌వీ వ్యాక్సిన్ ఇవ్వగా..పాత కేసుల్లో ఉన్న బాధితులు 27 మందికి వ్యాక్సిన్ ఇచ్చారు. ఒక్కరోజులో అందరూ కలిపి 47 మందికి టీటీ ఏఆర్‌వీ వ్యాక్సిన్ ఇచ్చారు. ఈ లెక్కల ప్రకారం చూస్తుంటే జిల్లాలో కుక్క కాటు బాధితులు ఏ స్థాయిలో పెరుగుతున్నారు తెలుస్తోంది. ప్రతి రోజు జనరల్ ఆస్పత్రికి 20 నుంచి 30 పైగా ఏఆర్‌వీ టీకా కోసం బాధితులు వస్తున్నారు. ఇక పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లకు సైతం వెళ్తున్నారు. సాధారణ కాటు ఉంటే ఏఆర్‌వీ, తీవ్ర గాయం ఉంటే సీరమ్ తీసుకోవడానికి జనరల్ ఆస్పత్రికి వస్తున్నారు. ప్రతి ఏటా జిల్లాలో కేసుల పెరుగుదలలో పురోగతి కన్పిస్తోంది.

1,868 వీధి కుక్కలకు వ్యాక్సిన్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో ఈ ఏడాది జనవరిలో 154, ఫిబ్రవరిలో 168, మార్చిలో 162, ఏప్రిల్‌లో 212, మే లో 132, జూన్‌లో 90, జూలైలో 309, ఆగస్టులో 197, సెప్టెంబర్‌లో 157, అక్టోబర్‌లో 141, నవంబర్‌లో 146 ఇలా 11 నెలల్లో మొత్తం 1,868 వీధి కుక్కలకు వ్యాక్సిన్ వేసినట్లు మున్సిపల్ అధికారులు చెబుతున్నారు.



హబీబ్‌నగర్‌లో వీధికుక్కలను పట్టుకున్న ప్రత్యేక బృందం

వెంటనే బయటపడదు..



పిచ్చి కుక్క కరవడం వల్ల వెంటనే రోగం బయటపడదు. మెడపై, ముఖంపై కరిస్తే 15 రోజుల్లో, కాళ్లకు కరిస్తే ఆరు నెలల్లో రేబిస్ లక్షణాలు కన్పిస్తాయి. నరాల ద్వారా వైరస్ బ్రెయిన్‌కు చేరుకుని ఆ తర్వాత శరీరంలో పలు మార్పులు చోటుచేసుకుంటాయి. కుక్క కరిచిన వెంటనే గాయాన్ని సబ్బుతో శుభ్రం చేసిన తర్వాత ఆస్పత్రికి వెళ్లి వైద్యుడి సూచనల మేరకే ఏఆర్‌వీ టీకాలు తీసుకోవాలి. ఇది కరిచిన రోజు మొదటి డోస్ మూడవ రోజు రెండవ డోస్, 7వ రోజు మూడవ డోస్, 14వ రోజు నాలుగో డోస్, 28వ రోజు ఐదవ డోస్ కచ్చితంగా తీసుకోవాలి. ఈ డోస్ వల్ల శరీరంలో ఇమ్యూనిటీ శక్తి పెరిగి వైరస్‌ను నశింపజేస్తోంది.

– డాక్టర్ శివానందస్వామి, అసిస్టెంట్ డైరెక్టర్ పశు సంవర్ధకశాఖ

మూడేళ్ల కాలంలో జనరల్ ఆస్పత్రిలో ఏఆర్‌వీ టీకాలు తీసుకున్న వారి వివరాలు

2022	2023	2024
9,164	8,900	10,197

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు మండలస్థాయిలో పోలీసు, రెవెన్యూ శాఖలతో ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ బృందాలు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయేందిర ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో ఇసుక కమిటీ జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇసుక రీచ్‌ల నుంచి ఇసుక అక్రమ రవాణా నిరోధించేందుకు డివిజన్ స్థాయిలో డీఎస్పీ, ఆర్డీఓ, జిల్లా రవాణా అధికారి సమన్వయంతో నిఘా ఉంచి తగు చర్యలు తీసుకోవాలన్నారు. గనుల శాఖ, రెవెన్యూ ఇరిగేషన్ భూగర్భ జల వనరుల శాఖలు సంయుక్తంగా క్షేత్ర స్థాయిలో పరిశీలిన చేసి జిల్లాలో 16 ఇసుక రీచ్‌లు గుర్తించినట్లు, ఇందులో 12 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక లభ్యత ఉందని గనుల శాఖ అధికారి వివరించారు. జిల్లాలో వివిధ మండలాలలో గుర్తించిన ఇసుక రీచ్‌లను దశల వారీగా పునరుద్ధరించాలన్నారు. స్థానిక అవసరాలు, ప్రభుత్వ పనులకు మన ఇసుక వాహనం ద్వారా అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఇసుక అక్రమంగా రవాణా చేస్తూ పట్టుకున్న వాహనాలను పెనాల్టీ విధించి స్థానిక తహసీల్దార్‌కు అప్పగించాలని, ఆ ఇసుకను వేలం ద్వారా విక్రయించాలని సూచించారు. అనుమతి లేకుండా క్వారీల్లో నడుపుతున్న స్టోన్ క్రషర్‌లకు విద్యుత్ సరఫరా నిలిపివేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మోహన్‌రావు, ఏఎస్పీ రాములు, డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఆర్డీఓ నవీన్, గనులు భూగర్భ శాఖ ఏడీ సంజయ్‌కుమార్, భూగర్భ జల వనరుల శాఖ డీడీ రమాదేవి, జిల్లా ఇరిగేషన్ అధికారి వెంకటయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

హోంగార్డుల వేతనం పెంపు

ఉమ్మడి జిల్లాలో 800 మందికి మేలు

మహబూబ్‌నగర్ క్రైం: హోంగార్డ్స్ దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని హోంగార్డులకు వేతనాలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి జిల్లాలో 800 మంది హోంగార్డులు ఉండగా దీంట్లో మహబూబ్ నగర్ జిల్లాలో 182, గద్వాల 129, నాగర్‌కర్నూల్ 149, వనపర్తి 133, నారాయణపేటలో 116మంది విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం హోంగార్డులకు రోజువారి వేతనం రూ.921 ఇస్తుండగా వాటిని రూ.వెయ్యికి పెంచింది. ఒక్కొక్కరి వేతనంలో రూ.79లు అదనంగా పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. అదేవిధంగా వీక్లీ పరేడ్ అలవెన్స్‌ను రూ.వంద నుంచి రూ.200లకు పెంచారు. దీంతో పాటు విధుల్లో ఉండి సహజంగా లేదా రోడ్డు ప్రమాదాల్లో మరణించిన హోంగార్డుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వనున్నారు. పెంచిన వేతనాలు జనవరి నెల నుంచి అమల్లోకి రానున్నాయి. హోంగార్డులకు వేతనం పెంచిన సందర్భంగా హోంగార్డులు శుక్రవారం రాత్రి పరేడ్ మైదానంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలభిషేకం చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల వివరాలు పరిశీలన



పాతతోటలో ఇందిరమ్మ లబ్ధిదారుల వివరాలను తెలుసుకుంటున్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్‌గౌడ్, కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాకేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల వివరాల పరిశీలన ఆరంభమైంది. ఈ మేరకు శుక్రవారం స్థానిక 45వ వార్డు పరిధిలోని పాతతోటలో మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ ఈ కార్యక్రమంలో భాగంగా కొత్త యాప్‌ను ప్రారంభించి మాట్లాడారు. పేదలకు ఇందిరమ్మ పథకం కింద ఇల్లు అందేలా చూడాలని అధికారులకు సూచించారు. ఈ యాప్‌లో ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు చేయాలన్నారు. అంతకుముందు పదో వార్డులో పర్యటించి స్థానికులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ వైస్‌చైర్మన్ షబ్బీర్‌అహ్మద్, కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు చిన్నా తదితరులు పాల్గొన్నారు.

■ కాగా, ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసం కొత్తగా రూపొందించిన యాప్‌పై శుక్రవారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయంలో వార్డు ఆఫీసర్లు, సిబ్బందికి కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి శిక్షణ ఇచ్చారు. ముఖ్యంగా దీనిని ఎలా ఉపయోగించాలో వారికి వివరించారు. క్షేత్రస్థాయి పరిశీలనలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

పార్కుల కోసం స్థలం పరిశీలన

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక పదో వార్డు పరిధిలోని అయోధ్యనగర్‌లో, మూడో వార్డులోని అప్పన్నపల్లిలో పార్కుల ఏర్పాటుకు శుక్రవారం స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ కె.లక్ష్మణ్‌యాదవ్, మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, ముడా నిధులతో నిర్మించే వీటి పనులను శనివారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించనున్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

జడ్చర్ల: అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా జడ్చర్ల మండలంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. పెద్ద ఆదిరాలలో రూ.35 లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. ఎస్సీ సబ్ ప్లాన్ కింద మరో రూ.25 లక్షలు సీసీ రోడ్లకు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులకు షూస్ పంపిణీ చేశారు. ఎక్వాయపల్లి, గుట్టకాడిపల్లిలో సీసీ రోడ్లు, అమ్మపల్లి, బోయలకుంట, చంద్రు తండాకు బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఆలూరులో అంగన్‌వాడీ భవనం, శిఖర్‌గానిపల్లిలో పంచాయతీ భవనం పనులకు శ్రీకారం చుట్టారు. ఆర్‌యూబీ ప్రారంభోత్సవం కోసం ఎదురు చూడకుండా ప్రజలే స్వచ్ఛందంగా ప్రారంభించడం మంచిదన్నారు. త్వరలోనే ఎంపీ డీకే అరుణను ఆహ్వానించి అధికారికంగా ఆర్‌యూబీని ప్రారంభిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గంలో 80శాతం రోడ్లను బీటీ రోడ్లుగా మారుస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు గంగ్యానాయక్, రాజు, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.



పెద్దఆదిరాలలో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

యువజన కాంగ్రెస్‌ను క్షేత్రస్థాయిలో పటిష్టం చేయాలి



అవేజ్ అహ్మద్‌ను సన్మానించిన కొత్వాల్, నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: యువజన కాంగ్రెస్ విభాగాన్ని జిల్లాలో మరింత పటిష్టంగా చేయాలని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన మహ్మద్ అవేజ్ అహ్మద్‌ను శుక్రవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో కొత్వాల్, నాయకులు ఘనంగా సన్మానం చేశారు. కొత్వాల్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో యువజన విభాగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఇప్పటి చాలా మంది జాతీయ, రాష్ట్రస్థాయి నాయకులు ఒక్కప్పుడూ యువజన కాంగ్రెస్‌లో పనిచేసిన వారేనని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు ధ్యేయంగా యువజన విభాగం నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, డీసీసీ ఉపాధ్యక్షులు చంద్రకుమార్‌గౌడ్, టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అఖ్తర్, డీసీసీ మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్, నాయకులు సాయిబాబా, అజ్మత్అలీ, ఫక్రుద్దీన్, పీర్ సాధిక్, గులాం జహీర్, నవనీత, వెంకట లక్ష్మి, అక్బర్, అలీం, అంతయ్య, సంజీవ్, జగదీశ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పంప్‌మోడ్ పద్ధతిలో నీటి తరలింపు

దోమలపెంట: శ్రీశైలం భూగర్భ కేంద్రంలో పంప్‌మోడ్ పద్ధతిలో ఇరవై నాలుగు గంటల వ్యవధిలో సాగర్ జలాశయం నుంచి 4,856 క్యూసెక్కుల నీటిని శ్రీశైలం జలాశయంలోకి (ఎత్తిపోతల) తరలించారు. పోతిరెడ్డిపాడు ద్వారా 1,500 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,589, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకెఎల్ఐకు 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. శుక్రవారం శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం 864.1అడుగుల వద్ద 119.1976 టీఎంసీల నీటి నిల్వ ఉంది. సాయంత్రం భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు.

తాగు నీటికోసం 20 క్యూసెక్కుల వినియోగం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడులో శుక్రవారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,020 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాలువ ద్వారా 390క్యూసెక్కులు ఇన్‌ఫ్లో కొనసాగుతుండగా సమాంతర కాలువ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. ఎన్టీఆర్ కాలువ ద్వారా 800 క్యూసెక్కులు కుడి, ఎడమ కాలువ ద్వారా 45 క్యూసె క్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు.

25 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



చారకొండ: అక్రమంగా తరలిస్తున్న 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ శంషోద్దీన్ తెలిపిన వివరాలు.. కల్వకుర్తి నుంచి దేవరకొండకు బొలెరోలో బియ్యం తరలిస్తున్నట్లు సమాచారం అందింది. చారకొండలో వాహనాన్ని పట్టుకొని స్టేషన్‌కు తరలించి బియ్యాన్ని స్వాధీన పర్చుకున్నారు.ఆర్ఐ రామకృష్ణ పంచనామా నిర్వహించారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్ఎన్ఆర్ క్వింటాల్ రూ.2,739



జడ్చర్ల/నవాబుపేట: బాదేపల్లి మార్కెట్‌లో శుక్రవారం ధాన్యం ఆర్ఎన్ఆర్ క్వింటాల్ గరిష్ఠంగా రూ.2,739, కనిష్ఠంగా రూ.1,866, హంస గరిష్ఠంగా రూ.2,200, కనిష్ఠంగా రూ.1,929, మొక్కజొన్న గరిష్ఠంగా రూ.2,417, కనిష్ఠంగా రూ.2,240, వేరుశనగ గరిష్ఠంగా రూ.6,197, కనిష్ఠంగా రూ.5,790, జొన్నలు రూ.2061 ధరలు లభించాయి.

■ నవాబుపేట మార్కెట్‌కు ధాన్యం పోటెత్తింది.5,590 బస్తాల ధాన్యం రావడంతో మార్కెట్ నిండిపోయింది. ధాన్యం ఎక్కువగా రావడంతో అదనంగా టెండర్లు వేయాలని రైతులు కోరారు. ఆదివారం కూడా టెండర్లు జరుగుతాయని, ధాన్యాన్ని బట్టి అదనపు టెండర్లు వేసేలా చూస్తామని మార్కెట్ చైర్మన్ లింగం తెలిపారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



భూత్పూర్: వైద్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఎంహెచ్ఓ డా.కృష్ణ హెచ్చరించారు. శుక్రవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. వైద్యసిబ్బంది తమవిధులు సక్ర మంగా నిర్వహించాలని సూచించారు. ఆసుపత్రి పరిధిలో ఎంత మందిని డెలివరీ చేశారని, నెలవారీ వివరాలు తెలిపే బోర్డును ఆస్పత్రిలో ఎందుకు పెట్టలేదని వైద్యాధికారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డెలివరీ వివరాలు కూడా చెప్పకపోవడంపై డీఎంహెచ్ఓ మండిపడ్డారు.

వ్యక్తిపై కోతి దాడి

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయం ఆవరణలో వ్యక్తిపై కోతి దాడి చేసిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం తాడూరు మండల కేంద్రానికి చెందిన మద్దిలేటి వ్యక్తిగత పనులపై జిల్లా కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయానికి వచ్చాడు. అకస్మాత్తుగా అతనిపై కోతి దాడి చేసింది. ఈ ఘటనలో మద్దిలేటికి స్వల్ప గాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు.

జడ్చర్లలో అమృత్ 2.0 సర్వే



డ్రోన్ సర్వేను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్

- డిగ్రీ కళాశాల మైదానంలో డ్రోన్ పాయింట్ సర్వే
- మున్సిపాలిటీలోని ప్రతి ఇల్లు ఇక డిజిటలైజేషన్
- సర్వే అనంతరం డీటీసీపీకి బేసిక్ మ్యాప్ అప్పగింత
- మాస్టర్‌ప్లాన్ అమలుకు కీలకం కానున్న డిజిటల్ సర్వే

జడ్చర్ల టౌన్: అమృత్ 2. 0 ద్వారా మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం సర్వే ఆఫ్ ఇండియా బృందం అర్బన్ టౌన్ ప్లానింగ్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా చేపట్టిన డిజిటల్ సర్వే జడ్చర్ల మున్సిపాలిటీలో ప్రారంభమైంది. పట్టణాల అభివృద్ధి కోసం రాష్ట్రంలోని 20 మున్సిపాలిటీలను అమృత్ 2.0 కింద డిజిటల్ సర్వే చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని మున్సిపాలిటీల్లో డిజిటల్ సర్వేకు ఎంపికై ంది జడ్చర్ల ఒక్కటే కావడం విశేషం. సర్వేలో భాగంగా పట్టణ విస్తీర్ణంతోపాటు అటవీ ప్రాంతం, చెరువులు, కుంటలు, నాలాలు, నివాసాలు కుటుంబాల గుర్తింపుతో కూడిన బేస్‌మ్యాప్ సిద్ధం చేయనున్నారు.



డ్రోన్‌తో సర్వే చేస్తున్న సర్వేయర్

డ్రోన్ సహాయంతో..

డ్రోన్ సహాయంతో చేపట్టిన డిజిటల్ సర్వేను మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, కమిషనర్ లక్ష్మారెడ్డి శుక్రవారం డిగ్రీ కళాశాల మైదానంలో ప్రారంభించారు. సర్వేలో ఏ అంశాలు నమోదు చేస్తారు అనే విషయాలను సర్వే ఆఫ్ ఇండియా సభ్యులు వారికి తెలియజేశారు.

డిగ్రీ కళాశాల మైదానం కేంద్రంగా..

మున్సిపాలిటీ 35 స్క్వేర్ కి.మీటర్లు డ్రోన్ సహాయంతో డిజిటల్ సర్వే చేయనున్నారు. పదిరోజులపాటు జరిగే సర్వేను ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం కేంద్రంగా ప్రారంభించారు. 5 స్క్వేర్ కి.మీ., మేర ఇక్కడి నుంచి సర్వే చేయనున్నారు. అనంతరం పట్టణంలోని మరో 5 కేంద్రాలను ఎంపిక చేసుకుని అక్కడి నుంచి సర్వే కొనసాగించనున్నారు.

పది రోజులపాటు..



మున్సిపాలిటీకి సంబంధించి బేసిక్‌మ్యాప్ సిద్ధం చేయడంతోపాటు అన్ని వివరాలు డిజిటలైజేషన్ చేయనున్నాం. పదిరోజులు పాటు డ్రోన్ సహాయంతో మున్సిపాలిటీలోని అన్ని వివరాలు నమోదు చేస్తాం. ప్రభుత్వ స్థలాలు, ఇండ్లు, నాలాలు, చెరువులు, కుంటల వివరాలు అన్ని డిజిటలైజ్ చేస్తాం. డిగ్రీ కళాశాల మైదానం కేంద్రంగా 5 స్క్వేర్ కి.మీటర్లు సర్వే చేస్తాం. పట్టణంలోని మరో 4 చోట్ల కేంద్రాలు ఏర్పాటు చేసుకుని సర్వే పూర్తిచేస్తాం. – గోపాల్‌రావు, సర్వేయర్, సర్వే ఆఫ్ ఇండియా

లెక్కింపు సులభం



సర్వే ఆఫ్ ఇండియా, అర్బన్ టౌన్ ప్లానింగ్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో డ్రోన్ సర్వే శుక్రవారం ప్రారంభమైంది. మున్సిపాలిటీ బేస్ మ్యాప్ సిద్ధం చేసి మాస్టర్ ప్లాన్ రూపొందించేందుకు ఇది ఉపయోగపడుతుంది. ప్రతి ఇంటిని డ్రోన్ ద్వారా ఫొటోలు తీసి డిజిటలైజేషన్ చేయడం వల్ల పన్నుల లెక్కింపు సులభమవుతుంది. పట్టణ విస్తీర్ణం పెరుగుతుండటంతో సర్వే ద్వారా మౌళిక అవసరాలు గుర్తించవచ్చు. – లక్ష్మారెడ్డి, మున్సిపల్ కమిషనర్, జడ్చర్ల

అన్నీ డిజిటలైజేషన్..

డ్రోన్ సహాయంతో మున్సిపాలిటీకి సంబంధించి పూర్తి వివరాలతో బేసిక్ మ్యాప్ సిద్ధం చేస్తారు. వీటిలో మున్సిపాలిటీ విస్తీర్ణం, హద్దులు గుర్తించనున్నారు. అలాగే అటవీ విస్తీర్ణం, ఖాళీ స్థలాలు, పార్కు స్థలాలు, నివాస గృహాలు, నాలాలు, కాల్వలు, రోడ్లు అన్నింటిని గుర్తించి డిజిటలైజేషన్ చేస్తారు. ప్రతి ఇంటి విస్తీర్ణం లెక్కించి డిజిటలైజేషన్ చేసి రికార్డు అన్నింటిని డీటీసీపీకి పంపిస్తారు. అక్కడి నుంచి తిరిగి మున్సిపాలిటీకి నివేదికలు చేరుతాయి. వాటి ఆధారంగా ఇంటి పన్నుల లెక్కింపు, ప్రభుత్వ స్థలాలను గుర్తించడం చేస్తారు. వీటితోపాటు భవిష్యత్ 20 ఏళ్ల కోసం మున్సిపాలిటీ అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ రూపొందించేందుకు డిజిటల్ సర్వే ఉపయోగపడుతుంది. అమృత్ 2.0 డిజిటల్ సర్వేలో చేసిన డిజిటలైజేషన్ ఆధారంగా నక్ష పథకం అమలుకు దోహదపడనుంది.

కార్మిక, కర్షక వర్గాన్ని అణచివేసేందుకు కుట్రలు



మాట్లాడుతున్న కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వేస్లీ

అమరచింత: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక, కర్షక వర్గాన్ని అణచివేసేందుకు కుట్రలు చేస్తోందని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వేస్లీ అన్నారు. మండల కేంద్రంలోని జీఎస్ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన సీపీఎం, ప్రజాసంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తూ.. నిరంకుశంగా పరిపాలిస్తుందన్నారు. కార్మిక, కర్షక వర్గానికి సంబంధించిన 29 చట్టాలను రద్దుచేసి, నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకురావడం ఏమిటని ప్రశ్నించారు. ఆ లేబర్ కోడ్‌లతో కార్మికులు కనీస వేతనాలు అడిగే హక్కు కూడా లేకుండా పోతుందన్నారు. వ్యవసాయ కూలీల కోసం తీసుకువచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తుంగలో తొక్కిందన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగులను మోసం చేసిందని.. ప్రజల మధ్య మతచిచ్చు పెడుతూ మతోన్మాదాన్ని పెంచుతుందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రభాకర్, జీఎస్ గోపి, రమేష్, వెంకటేష్, అజయ్, బుచ్చన్న, శ్యాంసుందర్, వెంకటేష్, హరికృష్ణ, రేణుకలత, వసంత పాల్గొన్నారు.

నకిలీ మందులు అమ్మితే చర్యలు



అమరచింత: ఫర్టిలైజర్ దుకాణాల్లో రైతులకు నకిలీ మందులు, ఎరువులను విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఏడీఏ దామోదర్ హెచ్చరించారు. మండలంలోని అమరచింత, చింతరెడ్డిపల్లె, ఈర్లదిన్నె గ్రామాల్లోని ఫర్టిలైజర్ దుకాణాల్లో శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఫర్టిలైజర్ దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం ఏడీఏ మాట్లాడుతూ.. రైతులకు అవసరమైన సమయంలో ఎరువులను అందుబాటులో ఉంచాలని.. లేని పక్షంలో పంటలకు సకాలంలో ఎరువులు అందక దిగుబడి తగ్గి నష్టపోయే పరిస్థితులు ఉంటాయన్నారు. ఫర్టిలైజర్ దుకాణాల్లో ఎరువులు, విత్తనాలను కొనేటప్పుడు పీఓఎస్ యంత్రంలో ఎంట్రీ చేసిన తర్వాతే కొనాలని రైతులకు సూచించారు. ఆయన వెంట ఏఓ అరవింద్, ఏఈఓ మల్లేష్ ఉన్నారు.

కల్తీ ఆహారం విక్రయాలపై నిఘా

వనపర్తి: జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న హోటళ్లు, రెస్టారెంట్లలో కల్తీ ఆహార విక్రయాలపై నిఘా పెట్టినట్లు జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నీలిమ అన్నారు. శుక్రవారం ఎస్పీ రావుల గిరిధర్ సూచన మేరకు పోలీసు బృందంతో కలిసి జిల్లా కేంద్రంలోని పలు హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆహార నిబంధనలు పాటించని సంగీత, ఇతర హోటళ్ల యజమానులకు నోటీసులు జారీ చేసినట్లు ఆమె తెలిపారు. మరికొన్ని హోటళ్ల యజమానులకు నిబంధనలు పాటించాలని హెచ్చరించినట్లు పేర్కొన్నారు. కాగా, కొన్ని హోటళ్లలో ఆహారం కొనటమంటే.. డబ్బులిచ్చి అనారోగ్యం కొన్నట్టు ఉందని అందిన ఫిర్యాదులకు స్పందించిన ఎస్పీ.. హోటళ్ల తనిఖీ కోసం ప్రత్యేక పోలీస్ బృందాన్ని ఏర్పాటుచేశారు. జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వెంట సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ తిరుపతిరెడ్డి తదితరులు ఉన్నారు.



హోటల్‌లో తయారు చేసిన ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నీలిమ

నారుమడి యాజమాన్య పద్ధతులు



బిజ్జారం శివారులో యాసంగి కోసం వేసిన నారుమడి

- విత్తనశుద్ధితో తెగుళ్ల నివారణ
- జాన్ సుధాకర్, డీఏఓ, నారాయణపేట

కోస్గి: యాసంగి సీజన్ ప్రారంభం కావడంతో వరిసాగు చేసే రైతులు వరినారు పోసుకునేందుకు సిద్ధమవుతున్నారు. బోరు బావుల కింద వరిసాగు కోసం నారుమళ్లు సిద్ధం చేసేందుకు సన్నద్ధమవుతున్న నేపథ్యంలో రైతులు పాటించాల్సిన నారుమడి యాజమాన్య పద్ధతులు, విత్తనశుద్ధితో ప్రయోజనాలను జిల్లా వ్యవసాయాధికారి జాన్ సుధాకర్ వివరించారు.

విత్తన శుద్ధి

నారుపోసే ముందు విత్తన శుద్ధి చేస్తే పలు రకాల కీటకాలు, తెగుళ్లు ఆశించకుండా నివారించుకోవచ్చు. 1 కిలో విత్తనాలను 2.5 గ్రాముల కార్బండిజమ్‌తో కలిపి 24 గంటలు నానబెట్టాలి. 1 కిలో విత్తనాలకు 3 గ్రాముల కాప్టన్ మందు కలిపి మడిలో చల్లుకోవాలి. దీనివల్ల నారుమడిలో ఆకుతినే పురుగు, ఉల్లికోడు, ముప్ప పురుగు ఆశించకుండా ఉంటాయి.

అధికారి సలహా



జాన్ సుధాకర్, డీఏఓ, నారాయణపేట

నారుమడి తయారీ

■ నారు పోయాల్సిన మడిని 10–12 రోజుల్లో మూడు దఫాలుగా దున్ని చదును చేయాలి. నీరు పెట్టడానికి, ఎక్కువైతే తీయడానికి అనుకూలంగా తయారు చేసుకోవాలి.

■ ఎకరా పొలం నాటడానికి 5 సెంట్లు (500 చదరపు మీ.) నారుమడి అవసరం. సెంటు భూమికి 5 కిలోల విత్తనాలు వాడాలి.

■ 5 సెంట్ల నారుమడికి 2 కిలోల నత్రజని, కిలో భాస్వరం, కిలో పొటాష్ ఉండే ఎరువులు వాడాలి.

కలుపు నివారణ

■ నారుమడిలో కలుపు నివారణకు ఎకరాకు బూటాక్లోర్ 1.5 లీటర్లు, 200 లీటర్ల నీటిలో కలిపి విత్తిన 7లేదా 8వ రోజున మడిలో నీటిని తొలగించి పిచికారి చేయాలి.

నాటు వేసుకునే విధానం

నాటు వేసే నారులో 4 నుంచి 6 ఆకులు ఉన్న నారును ఉపయోగించాలి. ముదురు నారు నాటితే దిగుబడి తగ్గుతుంది. నారు లోతులో కాకుండా పైపైన నాటితే ఎక్కువగా పిలకలు వచ్చే అవకాశం ఉంది. నాట్లు వేసేటప్పుడు భూసారాన్ని బట్టి ఖరీఫ్‌లో చదరపు మీటర్‌కు 44 దంట్లు(నారు మొలకలు) ఉండేలా నాటుకోవాలి.

■ విత్తిన 15 రోజులకు సైహాలో పాస్ బ్యూటైట్ 10 శాతం మందు 400 మీ.లీ.ను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి.

■ విత్తిన 10 రోజుల్లో కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు సెంటు నారుమడికి 150 గ్రాముల చొప్పున వేయాలి. లేదా మోనో క్రోటోఫాస్ 1.6 మీ.లీ మందును లీటర్ నీటిలో కలిపి విత్తిన 10 రోజులకు పిచికారి చేయాలి.

■ జింక్ లోపాన్ని గమనిస్తే లీటర్ నీటిలో 2 గ్రాముల జింక్ పాస్ఫేట్ ద్రావణాన్ని పిచికారి చేయాలి.

చలి ప్రభావం నుంచి రక్షణ..

యాసంగిలో చలి ప్రభావం నుంచి నారు మడుల్లో నారు ఎదగక పోవటం, ఆకులు పసుపు, ఎరుపు రంగుల్లోకి మారడంతోపాటు కొన్నిసార్లు నారుమడి చనిపోవడం జరుగుతుంది. ఇందుకు రైతులు కింది జాగ్రత్తలు తీసుకోవాలి.

■ సాయంత్రం వేళలో నారుమడిలో నీరు తీసేసి పగటిపూట వెచ్చటి నీరు పెట్టాలి. – రోజు సాయంత్రం ఒక అడుగు ఎత్తులో వెదురు బద్దలు అమర్చి దానిమీద సన్నటి ప్లాస్టిక్ షీట్ లేదా కల్లాలకు వాడే పట్టాలు నారుమడి మీద కప్పి మరుసటి రోజు ఉదయం తీసేయాలి.

■ జింక్ లోపం వలన ఆకులపై తుప్పు మచ్చలు ఏర్పడితే జింక్ సల్ఫేట్‌ను ఒక లీటర్ నీటికి 2 గ్రాముల చొప్పున కలిపి పిచికారి చేయాలి.

కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి



వీసీ శ్రీనివాస్‌తో ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, కరస్పాండెంట్లు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): పీయూ పరిధిలోని డిగ్రీ, పీజీ ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని వీసీ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఫార్మసీ ఆడిటోరియంలో పీయూ పరిధిలోని డిగ్రీ, పీజీ ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, కరస్పాండెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో సిలబస్ పూర్తి చేయాలని డిగ్రీ, పీజీలో ఫ్యాకల్టీని నియమించుకోవాలన్నారు. విద్యార్థినుల సంరక్షణ కోసం ప్రత్యేక వాష్ రూంలు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కొన్ని ప్రైవేట్ కళాశాలల్లో అధిక ఫీజులతో విద్యార్థులను వేధించడం మానుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ చెన్నప్ప, ఓఎస్డీ మధుసూదన్‌రెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి రాజుకుమార్, జేడీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణాలు కాపాడుదాం

ఆపదలో ఉన్న వాళ్లకు రక్తదానం చేసి వారి ప్రాణాలను కాపాడుదామని వీసీ అన్నారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఆధ్వర్యంలో శుక్రవారం బ్యాంక్‌లో రక్తదాన శిబిరం నిర్వహించగా వీసీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. రక్తదానం చేయడంపై చాలా మందిలో అపోహలు ఉంటాయని అలాంటివి పెట్టుకోవద్దన్నారు. సామాజిక సేవలో భాగంగా బ్యాంక్ వారు రక్తదానం చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో 62 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, ముడా చైర్మన్ లక్ష్మన్‌యాదవ్, బ్యాంక్ క్లస్టర్ హెడ్ అశోక్, బ్రాంచ్ మేనేజర్ రాజశేఖర్, సీనియర్ మేనేజర్ అశ్విన్, రజనీకాంత్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

గూడ్స్ రైలు బొగ్గు బోగిలో పొగలు



జడ్చర్ల రైల్వేస్టేషన్‌లో గూడ్స్ రైలు బోగిలో పొగలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

- జడ్చర్ల స్టేషన్‌లో నిలిపివేత
- ఫైరింజన్ సహాయంతో పొగలు ఆర్పిన సిబ్బంది

జడ్చర్ల టౌన్: కాజీపేట నుంచి రాయచూర్ థర్మల్ విద్యుత్ కేంద్రానికి శుక్రవారం బొగ్గు తీసుకువెళ్తున్న గూడ్స్ రైలు బొగ్గు బోగిలో పొగలు రావడంతో పైలెట్, కో పైలెట్‌లు గుర్తించి మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల రైల్వేస్టేషన్‌లో రైలును నిలిపివేసి.. ఫైరింజన్ సహాయంతో పొగలు ఆర్పారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. కాజీపేట స్టేషన్ నుంచి బొగ్గు లోడ్‌తో గూడ్స్ రైలు రాయచూర్‌కు బయలుదేరింది. మార్గమధ్యలో శంషాబాద్ సమీపంలో బొగ్గు క్యాబిన్ నుంచి పొగలు రావడంతో అక్కడ నిలిపివేసి ఫైరింజన్ సహాయంతో ఆర్పేశారు. పొగలు ఆరిపోయాక తిరిగి గూడ్స్ రైలు బయలుదేరింది. అయితే గొల్లపల్లి స్టేషన్ సమీపంలో తిరిగి పొగలు వస్తుండటాన్ని పైలెట్, కోపైలెట్ గమనించి జడ్చర్ల రైల్వేస్టేషన్‌లో రైలును నిలిపివేసి.. ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది స్టేషన్‌కు చేరుకుని బొగ్గు క్యాబిన్‌లోని పొగలు ఆర్పేందుకు తీవ్రంగా శ్రమించారు. అయితే బొగ్గు సరఫరాలో ఇలాంటివి సర్వసాధారణమని, బొగ్గు వేడి కారణంగా పొగలు వస్తాయని, వాటిని ఆర్పుతూ ముందుకు వెళ్తామని సిబ్బంది చెప్పారు.

అంబరాన్నంటిన ప్రజాపాలన సంబరాలు



కళాకారుల సంప్రదాయ నృత్య ప్రదర్శన



నృత్య ప్రదర్శన ఇస్తున్న చిన్నారి

వనపర్తి: జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాపాలన సంబరాలు అంబరాన్నంటాయి. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా రాష్ట్ర సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో 'ప్రజా ప్రభుత్వం పిలిచింది' కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రస్థాయి కళాకారులు తమ ప్రదర్శనలతో అలరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ప్రవేశ పెట్టిన పథకాలపై ప్రముఖ కళాకారుడు అంతడుపుల నాగరాజు బృందం ప్రదర్శనలు ఇచ్చారు. కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు తిలకించారు. తెలంగాణ పోరాటయోధుల వీరగాథలు, పోతరాజులు, బతుకమ్మ నృత్యాల ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. కళాకారులకు కలెక్టర్, ఎమ్మెల్యే మెమోంటోలు అందజేసి, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో డీపీఆర్ఓ సీతారాం, మున్సిపల్ చైర్మన్ పి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల సూచనలు పాటించాలి



ఖిల్లాఘనపురం: సహజంగా వచ్చే నొప్పుల నుంచి ఉపశమనం పొందేందుకు తరచూగా పెయిన్ కిల్లర్స్ వాడటం మంచిది కాదని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ అధికారులు రాజశేఖర్, నాయుడు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో ఎంఈఓ జయశంకర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలకు ఫిజియోథెరపిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తరచూగా పెయిన్ కిల్లర్ మందులు వాడటం వల్ల సైడ్ ఎఫెక్ట్ ఏర్పడే అవకాశం ఉంటుందన్నారు. అదే విధంగా ఎక్కువగా సెల్‌ఫోన్ వాడకంతో ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. అనంతరం ఉపాధ్యాయులకు ఫిజియోథెరపిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జీహెచ్ఎం మునావర్ సుల్తానా పాల్గొన్నారు.

ఈ-చలాన్స్‌పై స్పెషల్ డ్రైవ్



మహబూబ్‌నగర్ క్రైం: జిల్లాకేంద్రంలో ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం సాయంత్రం విస్తృతం వాహనాల తనిఖీలు నిర్వహించారు. కొత్తగా విధుల్లో చేరిన కానిస్టేబుల్స్‌కు విధుల శిక్షణలో భాగంగా ట్రాఫిక్ విధులు ఎలా నిర్వహించాలి, వాహనదారులతో ఎలా ప్రవర్తించాలి అనే అంశంపై ఈ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ప్రధానంగా ద్విచక్ర వాహనాలు, కార్లపై దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఈ-చలాన్ కేసులను పరిశీల నలో భాగంగా ఆయా వాహనాలు నిలిపి సదరు వాహనాలపై పెండింగ్ చలాన్స్ పరిశీలించారు.